క్లుప్తంగా

జాగ్రత్తలు తీసుకోవాలి..

నెల్లిమర్ల: ఎండలు విజృంభిస్తున్న నేపథ్యంలో ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీఓ జి.గిరిబాల ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ బయట తిరగరాదని పేర్కొన్నారు. అలాగే వేసవిలో మాంసాహారం తగ్గించి కూరగాయల్ని ఎక్కువగా తినాలని సూచించారు. నీరు, పళ్లరసాలు, కొబ్బరి నీళ్లు, మజ్జిగ ఎక్కువగా తీసుకోవాలన్నారు. రోజుకు కనీసం 15 గ్లాసుల నీళ్లు తాగాలని సూచించారు. తప్పరిసరి పరిస్థితుల్లో బయటకు వెళ్లేవారు గొడుగు తీసుకెళ్లడంతో పాటు టోపీ, రుమాలు వంటివి ధరించాలన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తం..



అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపకశాఖాధికారి సోమేశ్వరరావు

విజయనగరం క్రైమ్: అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక అధికారి వి.సోమేశ్వరరావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక వసంతవిహార్ అపార్ట్‌మెంట్స్‌లో అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌లు, గ్యాస్ ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన అంశాలను వివరించారు. కార్యక్రమంలో అపార్ట్‌మెంట్ వాసులు, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదానం



అన్నదానంలో పాల్గొన్న భక్తులు

విజయనగరం టౌన్: పట్టణంలోని నూకాలమ్మ ఆలయంలో వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం అన్నదానం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు గురాన అయ్యలు, కార్యదర్శి యడ్ల రాజేష్, కోశాధికారి వి.నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అధిక సంఖ్య భక్తులు పాల్గొన్నారు.

కుమిలి దేవాలయాన్ని సందర్శించిన వీసీ



ద్వాదశ దేవాలయంలో అంబేడ్కర్ యూనివర్సిటీ వీసీ వెంకటరెడ్డి దంపతులు

పూసపాటిరేగ : మండలంలోని కుమిలి ద్వాదశ దేవాలయాన్ని ఎచ్చెర్ల అంబేడ్కర్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఎస్.వెంకటరెడ్డి కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. వైస్ చాన్సలర్ దంపతులకు ఆలయ పురోహితులు ఆశీర్వచనం అందించారు. ద్వాదశ దేవాలయంలో వున్న దేవతామూర్తుల విగ్రహాలను తిలకించారు. ఆయనతో పాటు ఏయూ మాజీ వీసీ గోపాలకృష్ణారెడ్డి దంపతులు కూడా దర్శించుకున్నారు.

రామతీర్థంలో ఇస్కాన్ భక్తుల భజనలు



స్వామి సన్నిధిలో భజనలు చేస్తున్న ఇస్కాన్ భక్తులు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానాన్ని విశాఖ జిల్లా ఎండాడకు చెందిన ఇస్కాన్ భక్తులు, ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఆదివారం సందర్శించారు. సీతారామస్వామిని దర్శించుకున్న అనంతరం దేవాలయ ఆవరణలో భక్తి భజనలు చేపట్టారు. వివిధ భక్తి పాటలను పాడి భక్తుల్లో భక్తి పారవశ్యాన్ని నింపారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావాలను కలిగి ఉండాలని పిలుపునిచ్చారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం

శృంగవరపుకోట: మండలంలోని సంతగవిరమ్మపేట గ్రామంలో శనివారం జరిగిన అగ్నిప్రమాదంలో అయిదు దుకాణాలు దగ్ధమైన ఘటనలో బాధితులకు ఎంపీపీ సోమేశ్వరరావు, జెడ్పీటీసీ వెంకటలక్ష్మి ఆదివారం నిత్యావసర సరుకులు అందజేశారు. ఒక్కో కుటుంబానికి 20కిలోల బియ్యం, ఇతర సరుకులు అందజేశారు. సర్పంచ్ గోగాడ కళావతి, ఎంపీటీసీ శ్రీదేవి, వైస్ సర్పంచ్ అప్పారావు, మండల జేసీఎస్ ఇన్‌చార్జి కె.వెంకటరావు పాల్గొన్నారు.

అమ్మవారికి అభిషేకాలు

చీపురుపల్లి: పట్టణంలోని కనకమహాలక్ష్మి ఆలయంలో ప్రధాన అర్చకులు ఆరవెల్లి రవిశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ఆదివారం పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో ప్రతీ ఆదివారం ఆలయ కమిటీ చైర్మన్ ఇప్పిలి గోవింద, వైస్ చైర్మన్ సూరు కుమార్ నేతృత్వంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● వైఎస్సార్‌సీపీ నాయకులు

భోగాపురం: ప్రజా సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ధ్యేయమని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. మండలంలోని చెరుకుపల్లి, రావాడ, కొంగవానిపాలెం, ముంజేరు, కవులవాడ, గూడెపువలస గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు జగనన్నే మా భవిష్యత్.. కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో కలిసి స్థానిక నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమ పథకాల కొనసాగింపునకు వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు అపురభుక్త పైడినాయుడు, పూడిక నూకరాజు, నాయకులు కొండపు కొత్తయ్యరెడ్డి, వాసుపల్లి రొయ్యడు, రాయి ఈశ్వరరావు, పిడుగు రాంబాబు, ఆదినారాయణ, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్..



డెంకాడ: ఆకులపేటలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు

డెంకాడ: జగనన్నే మా భవిష్యత్ – మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం మండలంలోని ఆకులపేట, బొడ్డవలస, తదితర గ్రామాల్లో నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కలిగిన ఆర్థిక ప్రయోజనాలను.. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన వివక్ష పాలనను వివరించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చిత్రంతో కూడిన స్టిక్కర్లను అందజేశారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, సర్పంచ్ సువ్వాడ రమేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు కోరాడ కోటినాయుడు, ఎర్ర శ్రీనివాసరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



భోగాపురం: రావాడ పంచాయతీ గొల్లపేటలో జగనన్నే మా భవిష్యత్.. కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ అపురభుక్త పైడినాయుడు, తదితరులు



డెంకాడ: బొడ్డవలసలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరిస్తున్న నాయకులు

రక్తదాన శిబిరానికి స్పందన

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధి జరజాపుపేటలో స్థానిక సాధనా యువజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. 32 మంది దాతలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానం చేశారు. సంఘ సభ్యులు రేజేటి సూరిబాబు 18వ సారి, నల్లి రాధాకృష్ణ 15వ సారి, కనకల సురేష్ 15వ సారి, మద్దిల సూరిబాబు 12వ సారి రక్తదానం చేశారు. మహారాజా బ్లడ్‌బ్యాంక్ ప్రతినిధులు రక్తాన్ని సేకరించారు. శిబిరాన్ని ఎస్సై పి.నారాయణరావు, జిల్లా కేంద్రాస్పత్రి వైద్యాధికారి జి.శిరీష, ఎంఈఓ పోలుబోతు రామారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రక్తం కొరత తీర్చడానికి ఎప్పటికప్పుడు రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్న సాధనా సభ్యులను కొనియాడారు. అనంతరం రక్తదాతలను అభినందించారు. సాధనా అధ్యక్షుడు పోలుబోతు దుర్గాప్రసాద్, ఉపాధ్యక్షుడు బెల్లాన వెంకటరావు, ప్రధాన కార్యదర్శి పసుమర్తి వెంకటరమణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కడలి ప్రకాషరావు, బొడ్డేపల్లి రామకృష్ణారావు, సాధనా సభ్యులు తుమ్ము అశోక్, పల్ల శ్రీహరి, నల్లి ఉమ పాల్గొన్నారు.



రక్తదాతను అభినందిస్తున్న ఎస్సై నారాయణరావు

ప్రజా వ్యతిరేక విధానాలు తిప్పికొట్టాలి

విజయనగరం ఫూల్‌బాగ్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరించే ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని ప్రజా నాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి ఎస్.అనిల్ పిలుపునిచ్చారు.ఆదివారం స్థానిక ఎన్‌పీఆర్ భవనంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యురాలు పి.రమణమ్మ అధ్యక్షతన జరిగిన ప్రజా నాట్యమండలి వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా కంటక విధానాలను అవలంబిస్తూ, ప్రజా సంపదను కార్పొరేట్లకు ధారాదత్తం చేసి ప్రజలపై భారం మోపుతున్నాయని ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థలను అంచెలంచెలుగా ప్రైవేటుపరం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మోదీ ఎనిమిదేళ్ల పాలనలో కార్పొరేట్ శక్తులు ఆర్థికంగా లాభపడ్డాయన్నారు. ప్రజా కళలైన ఆటపాటల ద్వారా ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలను చైతన్యపరచాలని సూచించారు. కార్యక్రమంలో ప్రజా నాట్యమండలి రాష్ట్ర నాయకుడు రమణ, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు డి.రాము, ఐద్వా నాయకురాలు పి. రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రజా నాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి అనిల్

కాలువ నిర్మాణంపై సమీక్ష



కాలనీవాసులు చెబుతున్న సమస్యలను వింటున్న ఆర్డీఓ సూర్యకళ, డీపీఓ శ్రీధర్‌రాజా

భోగాపురం: మండలంలోని ముంజేరు పంచాయతీ పరిధి సిద్ధార్థనగర్ కాలనీ సమీపంలో అధికారులు తలపెట్టిన కాలువ నిర్మాణ విషయంలో ముంజేరు గ్రామస్తులు, కాలనీ వాసుల మధ్య వివాదం తలెత్తిన విషయం తెలిసిందే. దీనిపై ఆర్డీఓ సూర్యకుమారి శనివారం రాత్రి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇరువర్గాలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ, కాలనీ మీదుగా కాలువ నిర్మిస్తే దోమలు వృద్ధి చెంది అంటురోగాలు ప్రబలుతాయన్నారు. గతంలో వాడుకనీరు ఏవిధంగా పోయేదో ఆ మార్గంలోనే కాలువను నిర్మించాలని కాలనీవాసులు ఆర్డీఓను కోరారు. దీనికి ముంజేరు గ్రామస్తులు స్పందిస్తూ గతంలో గ్రామంలోని వాడకం నీరు ఐదు కాలువల ద్వారా బయటకు పోయేదన్నారు. ఇంకా కొంత నీరు రైతుల జిరాయితీ భూముల్లోకి పోతుండేదని చెప్పారు. అప్పట్లో జిరాయితీ భూములు ఖాళీగా ఉండేవని.. ప్రస్తుతం అదే జిరాయితీ భూముల్లో రైతులు భవన నిర్మాణాల చేపట్టడంతో నీరు పోయేందుకు అవకాశం లేకుండా పోయిందని సర్పంచ్ పూడిక నూకరాజు, తదితరులు తెలిపారు. ఇరువర్గాల వాదనలు విన్న తర్వాత ఆర్డీఓ స్పందిస్తూ మండల సర్వేయర్‌ను లేదా మీకు నచ్చిన ప్రైవేట్ సర్వేయర్‌ను గాని తీసుకుని సోమవారం మీ గ్రామానికి వచ్చి, ప్రభుత్వానికి సంబంధించిన భూముల్లో నుంచి వాడుక నీరు పోయేందుకు వీలుగా అన్ని మార్గాలను పరిశీలిస్తామని తెలిపారు, ఈ సర్వేలో ముంజేరు గ్రామస్తులతో పాటు సిద్ధార్థనగర్ కాలనీ వాసులు పాల్గొనాలని కోరారు. సమావేశంలో డీపీఓ శ్రీధర్‌రాజా, ఎంపీడీఓ దాసరి బంగారయ్య, డీటీ శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ డీఈ బంగారునాయుడు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో ఉండే నాయకులను ఎన్నుకోండి..

● డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉన్న నాయకులను ఎన్నుకోవడం ద్వారా మరిన్ని ఉత్తమ సేవలు అందుతాయని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. నగరంలోని 31వ డివిజన్ పరిధి పద్మావతినగర్, వసంత విహార్ ప్రాంతాలలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యలు తెలుసుకుని, వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో వసంతవిహార్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ప్రజలతో మమేకమయ్యారు. స్థానికులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకురాగా.. వాటిని పరిష్కరించాలని ఎమ్మెల్యే కోలగట్ల సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా తాను పని చేస్తున్నట్లు చెప్పారు. సామాజిక సేవ చేయడంలోనే నిజమైన సంతృప్తి ఉందన్నారు. సోమవారం సాయంత్రానికి వీధిదీపాలు ఏర్పాటు చేస్తారని.. అలాగే రెండు రోజుల్లో డంపర్ బిన్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. వారం రోజుల్లో ప్రధాన కాలువ పనులు చేపడతామని చెప్పారు. సమీపంలో చేపడుతున్న వాటర్ ట్యాంక్ నిర్మాణం పూర్తి కాగానే కుళాయి కనెక్షన్లు మంజూరు చేస్తామని తెలిపారు. నగరంలో ఇప్పటికే అనేక అభివృద్ధి పనులు చేపట్టామని.. ప్రధాన జంక్షన్‌లను సుందరంగా తీర్చిదిద్దామని తెలిపారు. మహిళల కోసం ప్రత్యేకంగా నిర్మించిన పార్కును కూడా త్వరలోనే ప్రారంభించబోతున్నట్లు ప్రకటించారు. సామాన్య కార్యకర్తగా రాజకీయాల్లోకి వచ్చిన తాను డిప్యూటీ స్పీకర్ స్థాయికి చేరానంటే అదంతా ప్రజల బలంతోనే సాధించానని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ఎన్ని లక్ష్మణరావు, జోనల్ ఇన్‌చార్జ్ బొద్దాన అప్పారావు, కార్పొరేటర్ గణపతిరావు, మారం బాలబ్రహ్మరెడ్డి, అసోసియేషన్ అధ్యక్షుడు శివ, కార్యదర్శి శ్రీరామ్, ప్రజారోగ్య అధికారి సత్యనారాయణ, డీఈ అప్పారావు, ఏఈ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

గంట్యాడ: ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు ఏఎస్ఐ రాంబాబు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద మజ్జిగ, మంచినీరు చలివేంద్రాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ ఎండ తీవ్రత అధికంగా ఉన్నందున ప్రజలు వడదెబ్బకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, సాధ్యమైనంతవరకు ఎండలో ప్రయాణాలు మానుకోవాలన్నారు. హెడ్ కానిస్టేబుల్ రామకృష్ణ, రమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయమే మేలు



ప్రకృతి వ్యవసాయాన్ని పరిశీలిస్తున్న డీపీఎం ఆనందరావు

బొండపల్లి: పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయమే అన్ని విధాలా మేలని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రబంధకుడు (డీపీఎం) ఎస్.ఆనందరావు అన్నారు. మండలంలోని కొవ్వాడపేట గ్రామంలో ప్రకృతి వ్యవసాయ పంటలను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 365 రోజులూ ఏదో ఒక పంటను సాగు చేయడం వల్ల భూమి సారవంతంగా ఉంటుందని తెలిపారు. జిల్లాలో కొన్ని గ్రామాలను ప్రకృతి వ్యవసాయానికి ఎంపిక చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఏ మెర్సీ,మండల యాంకర్ ఎస్.రామకృష్ణ, ఐసీఆర్‌పీ ఎం.కిషోర్, ఎం.రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలోనే ముస్లింల అభివృద్ధి

బొబ్బిలి: రాష్ట్రంలో ముస్లిం, మైనార్టీ వర్గాలను ఆదుకునేది వైఎస్సార్‌సీపీయేనని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. పట్టణానికి చెందిన ముస్లిం మత పెద్దలు ఆదివారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లింలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని వివరించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు, ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసరావు, జేసీఎస్ పట్టణ ఇన్‌చార్జ్ రేజేటి ఈశ్వరరావు(విసు), ముస్లిం మైనార్టీ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ హమీద్, జామియా మసీదు అధ్యక్షుడు హాజీ పీరా, మదరసా స్కూల్ ప్రిన్సిపాల్ అబ్దుల్ కలాం, సాధిక్, నాగూర్ జానీ, రజాక్, అజ్గర్ అలీ, ఇంతియాజ్, తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలి

తెర్లాం: విద్యార్థులంతా చిన్నప్పటి నుంచే పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవడం ఎంతో మంచిదని స్థానిక శాఖా గ్రంథాలయ లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి అన్నారు. 'చదవడం మాకిష్టం' అనే కార్యక్రమాన్ని ఆదివారం స్థానిక గ్రంథాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చిన్నారులకు పుస్తక పఠనాన్ని అలవాటు చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం 'చదవడం మాకిష్టం' కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. ప్రతి విద్యార్థీ పాఠ్య పుస్తకాలతో పాటు ఇతిహాసాలు, కథల పుస్తకాలు, జనరల్ నాలెడ్జ్ పుస్తకాలు చదవాలని సూచించారు. విద్యార్థులంతా లైబ్రరీలో ఏర్పాటు చేసిన చిల్డ్రన్స్ క్లబ్‌లో చేరాలని కోరారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనంపై అవగాహన కల్పించారు.

రక్తదానం సామాజిక బాధ్యత



రక్తదాతలను అభినందిస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

● ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

చీపురుపల్లి(గరివిడి): ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని, రక్తదానం సామాజిక బాధ్యతగా భావించాలని విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. గతేడాది మృతి చెందిన ఉపాధ్యాయిని ఉప్పు పార్వతి, సహాయ్ స్వచ్ఛంద సంస్థ సభ్యుడు కుమిలి శ్రీహరి, ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందిన నేవీ మెరైన్ కమాండో చందక గోవింద్ జ్ఞాపకార్థం గరివిడి పట్టణానికి చెందిన సహాయ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గరివిడిలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈశిబిరాన్ని ఎంపీ ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ మూడు నెలలకోసారి రక్తదానం చేయవచ్చని అన్నారు. అత్యవసర సమయాల్లో రక్తం లభించక ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని, మనం చేసే రక్తదానం వేరొకరికి ప్రాణదానమని అన్నారు. సహాయ్ స్వచ్ఛంద సంస్థ ఎప్పటికప్పుడు రక్తదాన శిబిరాలు నిర్వహిస్తుండడం అభినందనీయమని అన్నారు. శిబిరంలో 40 మంది నుంచి విశాఖపట్నానికి చెందిన ఏ.ఎస్.రాజా బ్లడ్ బ్యాంక్ సిబ్బంది రక్తం సేకరించారు. ఎస్ఎంఎస్ ఫెర్రో పరిశ్రమ డైరెక్టర్ వాకాడ గోపి, జెడ్పీటీసీ వాకాడ శ్రీనివాసరావు, గంట్యాడ బుజ్జి, సహాయ్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు వుప్పు శ్రీను, కోశాధికారి సీతారాం, సంస్థ ప్రతినిధులు సరిది రాంబాబు, బమ్మిడి కార్తీక్, ఎస్.శ్రీనివాసరావు, చిన్న, శంకర్, సివుకు కాంతారావు పాల్గొన్నారు.

అభివృద్ధికి రాజమార్గం

● సోంపురం- ఆనందపురం రహదారికి మోక్షం
● రూ.39.14 కోట్లతో రోడ్డు విస్తరణ పనులు



సోంపురం- ఆనందపురం రహదారిలో ఎన్.కె.ఆర్.పురం వద్ద పూర్తయిన విస్తరణ పనులు



చిరతపాలెం జంక్షన్ వద్ద కొత్తగా వేస్తున్న రహదారి



ఎన్.కె.ఆర్.పురం- భర్తవానిపాలెం మధ్య నిర్మించిన కల్వర్టు

శృంగవరపుకోట: ఒక్క రహదారి.. మండలం తీరుతెన్నులు మార్చబోతోంది. సుమారు 50 వేల పైచిలుకు జనాభా ఆశలు, ఆకాంక్షలు, అభివృద్ధిని నిజం చేయనుంది. అదే.. జిల్లాలోని సోంపురం-ఆనందపురం రహదారి. జిల్లాలో వెనుకబడిన వేపాడ మండలం మొత్తాన్ని అనుసంధానం చేసేది ఈ ఒక్క రహదారే. రెండు దశాబ్దాల క్రితం సోంపురం-ఆనందపురం మెటల్ రోడ్డును తారురోడ్డుగా మార్చారు. అటు తర్వాత చిన్న చితకా మరమ్మతులు తప్ప రహదారి అభివృద్ధికి నోచుకోలేదు. ఎట్టకేలకు వైఎస్సార్‌సీపీ సర్కారు చొరవతో ఈ రహదారికి మోక్షం లభించింది.వేపాడ మండలంలోని సోంపురం జంక్షన్ నుంచి అనకాపల్లి జిల్లాలోని ఆనందపురం వరకు ఉన్న 16.8 కిలో మీటర్ల రహదారి విస్తరణ, అభివృద్ధి పనులకు ప్రభుత్వం రూ.39.14 కోట్ల ఎన్‌డీబీ నిధులు విడుదల చేసింది. ఇది వరకు 3.50 మీటర్ల వెడల్పు ఉన్న రోడ్డును 7 మీటర్ల వెడల్పు చేస్తున్నారు. రోడ్డులో ప్రస్తుతం ఒక మైనర్ బ్రిడ్జి, శ్లాబ్ కల్వర్ట్, 4 బాక్స్ కల్వర్టులు, 48 పైపు కల్వర్టులను నిర్మిస్తున్నారు. 2.8 కిలో మీటర్ల మేర సీసీ రోడ్డు, 2.98 కిలో మీటర్ల మేర సీసీ డ్రెన్లు, 13.996 కిలో మీటర్ల మేర బ్లాక్‌టాప్(తారు) రోడ్డు వేస్తున్నారు.

మండలాభివృద్ధికి మార్గం సుగుమం

సోంపురం-ఆనందపురం రహదారి పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందితే ఎలమంచిలి, అనకాపల్లి, చోడవరం ప్రాంతాల నుంచి ప్రయాణికులతో వచ్చే వాహనాలు, సరుకు రవాణా వాహనాలు పెరుగుతాయి. దీంతో వర్తక, వాణిజ్య వ్యాపారాలు, రియల్ ఎస్టేట్ రంగాలు ఊపందుకుని అన్ని రకాలుగా వేపాడ మండలం అభివృద్ధి చెందుతుంది. మండలంలో 22 పంచాయతీలను కలుపుతూ వాటి అభివృద్ధికి ఆధారం ఈ రహదారి. వేపాడ మండలానికి పల్లె వెలుగు బస్ ఒక్కటి కూడా లేదు. మండలవాసులు ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే నిత్యం అవస్థలు పడాల్సిందే. ఆటోలు తప్ప మరో గత్యంతరం లేదు. రోడ్డు బాగా లేదని, ఉన్న బస్సులు తీసేశారు. రోడ్డు విస్తరణ పూర్తయితే అనకాపల్లి, చోడవరం, దేవరాపల్లి నుంచి వేపాడ మీదుగా ఎస్.కోటకు సర్వీసులు వస్తాయన్న ఆశాభావంతో మండల వాసులు ఉన్నారు. రోడ్డు-రవాణా సౌకర్యాలు మెరుగుపడితే తమ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్న మండలవాసులు ఎదురు చూపులు ఇన్నాళ్లకు ఫలించబోతున్నాయి.

కష్టాలు తీరుతాయి



ఈ రోడ్డు పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందితే మా మండల వాసుల కష్టాలు తీరుతాయి. బస్సులు లేక, రోడ్డు బాగా లేక, ప్రైవేటు వాహనాలు రాక ఇబ్బందులు పడుతున్నాం. జగనన్న సర్కారు దయతో ఇప్పుడు రోడ్డును అభివృద్ధి చేస్తున్నారు. ఎస్.కోట నుంచి అనకాపల్లి, చోడవరం బస్సులు వేస్తే మా ఇబ్బందులు పూర్తిగా తీరుతాయి.

– కర్రి యశోధ, సర్పంచ్, బానాది గ్రామం

అభివృద్ధికి ఆస్కారం



ఏ ప్రాంతం అభివృద్ధి చెందాలన్నా రహదారులు ముఖ్యం. సోంపురం- ఆనందపురం రోడ్డు విస్తరణతో ఈ ప్రాంతం ఖచ్చితంగా అభివృద్ధి చెందుతుంది. వ్యాపార, వ్యవహారాలు సాగుతాయి. బయటి ప్రాంతాల వారు వస్తారు. భూముల ధరల పెరుగుతాయి. రవాణా సౌకర్యాలు మెరుగవుతాయి.

– బొడ్డు మంగరాజు, జగ్గయ్యపేట గ్రామం